క్లుప్తంగా

వైభవం.. లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణం



ఉత్సవ మూర్తులకు అలంకరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగర శివారులోని ఊటుకూరు లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం స్వామి, అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మెన్ గోసుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మూల విరాట్‌కు పంచామృత అభిషేకం, కుంకుమార్చనతోపాటు పలు రకాల పూజలు జరిపారు. ఉదయం 11 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణం ఘనంగా జరిపారు. మధ్యాహ్నం అన్నదానం జరిపి రాత్రి ఉత్సవ మూర్తులను ఊరేగించారు.

సీపీఎం పార్టీ నుంచి బహిష్కరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన పాపిరెడ్డిని సీపీఎం పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ కడప నగర కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాపిరెడ్డి గత కొంతకాలంగా పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. పార్టీ నాయకులను గౌరవం లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడడం, ఆస్తుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కొద్ది రోజులుగా పార్టీ మందలించిందని తెలిపారు. అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో నోటీసులు ఇచ్చి బహిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, కుమారస్వామిరెడ్డి పాల్గొన్నారు.

నిర్మల దేశ్ పాండే వర్ధంతి



అన్నదానం చేస్తున్న రాజగోపాల్, తదితరులు

కడప కార్పొరేషన్: అఖిల భారత రచనాత్మక సమాజ్ వ్యవస్థాపకులు నిర్మలా దేశ్ పాండే వర్ధంతి సందర్భంగా కడప ప్రకాష్ నగర్‌లోని స్నేహాలయ వసతి గృహంలో గురువారం అన్నదానం నిర్వహించారు. అఖిల భారత రచనాత్మక సమాజ్ లైఫ్ మెంబర్ ఎంకే.రాజగోపాల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సంయుక్త కార్యదర్శిగా శ్రీరంజన్‌రెడ్డి

కడప రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీ జాయింట్ సెక్రటరీగా వై.శ్రీరంజన్‌రెడ్డి నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీలో వివిధ హోదాలలో నియామకాలు చేపట్టారు. ఈ మేరకు జాయింట్ సెక్రటరీగా వై.శ్రీరంజన్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

గుర్తింపుకార్డులు ఇవ్వాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: పాస్టర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పాస్టర్ పి.మహేష్ కోరారు. మైనార్టీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన హిదాయతుల్లాను గురువారం ఆయన కలిసి శాలువాతో సత్కరించారు. పాస్టర్ మహేష్ మాట్లాడుతూ గౌరవ వేతనాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జయరాజ్, రమేష్‌బాబు, రవితేజపాల్గొన్నారు.

ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ



ప్రతాప్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప వన్‌టౌన్ ఎస్ఐగా నియమితులైన ప్రతాప్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో రిమ్స్, నందలూరు, ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేస్తూ వన్‌టౌన్‌కు బదిలీపై వచ్చారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

హామీలపై నోరు విప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

కడప రూరల్: విభజన హామీలపై ప్రధాని నరేంద్రమోదీ నోరు విప్పాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.నారాయణ తెలిపారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అమరావతి శంకుస్థాపన పనులను రెండోసారి ప్రారంభించేందుకు రాష్ట్రానికి వస్తున్నారన్నారు. కడప ఉక్కు పరిశ్రమ, కడప బెంగళూరు రైల్వే పనుల అంశాలపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు. కడప–బెంగళూరు రైల్వేలైన్ పనులు 20 ఏళ్ల కిందట ప్రారంభించినా పూర్తికాలేదన్నారు. సీఆర్‌వీ.ప్రసాద్, గుర్రప్ప, శ్రీనివాసులు, కృష్ణ, అంజి, నాగేంద్ర పాల్గొన్నారు.

నేడు వ్యవస్థాపక దినోత్సవం

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.విశ్వనాథ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగే సదస్సులో శాస్త్ర సాంకేతిక పురోగతి, జాతీయ విద్యా విధానంపై చర్చ జరుగుతుందన్నారు. విశ్రాంత ఆచార్యులు డా.పెంచలయ్య కీలకోపన్యాసం చేయనున్నారన్నారు.

పాలక ప్రభుత్వాలపై సమరశీల పోరాటం



మేడే వేడుకల్లో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: సంపద సృష్టిలో భాగస్వామ్యం అవుతున్న కార్మికులను దోపిడీ చేసి కార్పొరేట్లకు దోచిపెట్టె పాలక ప్రభుత్వాలపై పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర అన్నారు. మేడే సందర్భంగా పాత రిమ్స్ వద్ద గురువారం ఏఐటీయూసీ జెండాను ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది గంటల పని వేళలు, కనీస వేతనం, భద్రత, సెలవులు, సంక్షేమం దాన ధర్మాల ద్వారా వచ్చినవి కావని, కార్మికుల స్వేదం, రక్తం, త్యాగాల ద్వారా సాధించారని తెలిపారు. మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను కలిపి కేవలం 4 కోడ్‌లుగా మార్చిందని, కార్మికుల వేతన భద్రత, ఉద్యోగ భద్రత, యూనియన్ హక్కులన్నీ ప్రమాదంలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.మద్దిలేటి, శంకర్ నాయక్, మల్లికార్జున, పుల్లయ్య, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీపీ ఆధ్వర్యంలో

ఎర్రజెండా పేదల కోసమే పని చేస్తుందని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్‌రెడ్డి అన్నారు. మేడే సందర్భంగా రాష్ట్ర కార్యాలయంలో ఆర్‌సీపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. మోదీ ప్రభుత్వం కార్పొరేటర్ వర్గాలకు అనుకూలంగా కార్మిక చట్టాలను తొలగించే కుట్ర చేస్తోందన్నారు. కార్పొరేట్, పెట్టుబడిదారులు పేదల శ్రమను దోచుకుంటున్నారని, గతంలో ఎనిమిది గంటల పని దినాన్ని కార్మికులు సాధించుకుంటే.. ప్రస్తుత కార్పొరేట్ శక్తులు అధికార పార్టీ అండతో నేడు 12, 16 గంటలు పని చేయించుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, మగ్బూల్ బాషా, సిద్దిరామయ్య, రవి, పుష్పరాజు, గంగన్న, చంద్‌బేగం, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ....

మేడే సందర్భంగా సీపీఎం జెండాను గురువార ఆవిష్కరించారు. కడప కార్పొరేషన్ కార్యాలయం నుంచి పాత బస్టాండు వరకూ కార్మిక సంఘాలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం, ఎన్డీఏ కూటమి న్యూ లేబర్ కోడ్లు పార్లమెంటులో ఆమోదించి, పారిశ్రామిక అధిపతులకు 12 గంటలు పని చేయించుకోవడానికి అవకాశం ఇచ్చిందన్నారు. కార్మిక రక్షణ, భద్రత , సామాజిక న్యాయం అందించే 44 చట్టాలను, డజన్ల కొద్దీ కార్మిక సంక్షేమ చట్టాలను, జీవోలను, ఆర్డినెన్స్‌లను రద్దు చేసిందని విమర్శించారు. కార్మికులకు ముందస్తుగా నోటీసులు లేకుండా తొలగించే హక్కును దేశంలోని విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలకు కల్పించిందన్నారు. న్యాయం కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం కార్మిక వర్గంపై ఉందని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో......

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్మిక శాఖ విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా వెంకట రాజశేఖర్, కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఫైరోస్ హుస్సేన్ సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్‌గౌడ్, సయ్యద్ గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో.....

గురువారం బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్, విశ్రాంత ఉద్యోగులు మే డే కార్మికుల దినోత్సవం సందర్భంగా నగరంలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయ ఆధ్వర్యంలో జెండాను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, సుధాకర్, సుబ్బారావు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సచివాలయాల వద్ద

కడప కార్పొరేషన్: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కడప నగర పాలక సంస్థ పాత మున్సిపల్ కార్యాలయం, చెమ్ముమియాపేట, ఆలంఖాన్ పల్లె సచివాలయాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఎర్ర జెండాను ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుపాల్, ఎస్.రవి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాల అవలంభిస్తోందని ధ్వజమెత్తారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్యంగా ఉద్యమించడం ఒక్కటే మార్గమని సూచించారు. పాత మున్సిపల్ కార్యాలయంలో ఎస్ కిరణ్ , చెముమియాపేటలో ఎస్.చెన్నయ్య, ఆలంఖాన్‌పల్లిలో నాగరాజ్ జెండా ఆవిష్కరించారు. మహిళా కార్మికులు, లోడర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

కార్మిక హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తాం

కడప సెవెన్‌రోడ్స్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నల్లచట్టాలను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తే ఉద్యమిస్తామని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు బి.లక్ష్మిరాజా హెచ్చరించారు. మేడే సందర్భంగా సుందరయ్యనగర్‌లో జెండాను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా కార్మికులు ఎనిమిది గంటల పనిదినాలు సాధించుకోగా, 12 గంటలు పనిచేయాలంటూ ప్రభుత్వాలు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. నల్లచట్టాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుపాల్, సుంకర రవి పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టాలి

కడప కార్పొరేషన్: శ్రమ దోపిడీ, ప్రైవేటీకరణ విధానాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామలింగారెడ్డి, ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక విద్యుత్ భవన్ ఎదుట గురువారం యూనియన్ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాగసుబ్బారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వేణుగోపాల్, ప్రతాపరెడ్డి నాగిరెడ్డి, రామచంద్రారెడ్డి, కేశవ, హరికేశవరెడ్డి, దస్తగిరి, హాజీ భాష, జయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్: కార్మిక హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తే సహించేది లేదని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. మేడే సందర్భంగా కడప నగరంలో గురువారం ర్యాలీ నిర్వహించి పాత బస్టాండులో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులను దోపిడీ చేసి సంపన్న వర్గాలకు దోచిపెట్టే పాలక ప్రభుత్వాలపై సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఎనిమిది గంటల పని వేళలు, కనీస వేతనం, భద్రత, సెలవులు, సంక్షేమం ఎవరో ఇచ్చినవి కావని, కార్మికుల స్వేదం, రక్తం,త్యాగాల ద్వారా సాధించబడ్డాయన్నారు. కార్మిక ఖర్చులు తగ్గించేందుకు కాంట్రాక్ట్ వ్యవస్థలు, ఔట్‌సోర్సింగ్, ఆటోమేషన్ పేర్లతో దోపిడీకి తెర తీస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మనోహర్, జి చంద్రశేఖర్, ఐఎస్.సుబ్బమ్మ, రామ్మోహన్, చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి, రామాంజనేయులురెడ్డి, బి.లక్ష్మీదేవి, సుంకరరవి, కంచుపాటి తిరుపాల్, కుమారస్వామిరెడ్డి, కేశవ, గోపి పాల్గొన్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో

కడప రైల్వేస్టేషన్‌లో మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, శ్రీరామకృష్ణయ్య, వెంకట సుబ్బయ్య, రాజేష్, శంకర్, అనిల్‌కుమార్, గురుస్వామి, గీత, రమాదేవి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని రెవాల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ జిల్లా నాయకులు నరసింహారావు అన్నారు. కడప ఆర్‌ఎస్‌పీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో భరత్, హరి, సుబ్బారాయుడు, గోపి నరసింహ, సురేంద్ర, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నల్ల చట్టాలను రద్దుచేయాలి



జెండాను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: కార్మికుల హక్కులను కాలరాసే నల్ల చట్టాలను రద్దు చేయాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. కడప యూటీఎఫ్ కార్యాలయం వద్ద మేడే సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 10 గంటలు, 12 గంటలు మరియు 14 గంటలు పని చేయాలని కార్మికులపై నల్ల చట్టాలను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. కార్పొరేట్లకు మేలు జరిగే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, సీవీ.రమణ, ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రూతు ఆరోగ్యమేరీ, కృష్ణారెడ్డి, గోపీనాథ్, చంద్రశేఖర్, కేదార్‌నాథ్, శివశంకర్, శివకుమార్ రాజు, ప్రకాష్ బాబు, అనిల్ కుమార్, రామకేశవ, వీరనారాయణ,దేవదత్తం, గంగన్న, గంగరాజు పాల్గొన్నారు.



జెండాను అవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు



విద్యుత్ భవన్ వద్ద మేడే వేడుకలు



కాంగ్రెస్ కార్యాలయంలో..



జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న తిరుపాల్



జెండాను అవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

5 నుంచి ఏపీటీఎఫ్ నిరసన కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: విద్యా రంగంలో సంస్కరణల పేరుతో కూటమి ప్రభుత్వం గందరగోళ పరిస్థితులు కల్పిస్తోందని.. ఇందుకు నిరసనగా ఈ నెల 5వతేదీ నుంచి ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) రాష్ట ఉపాధ్యక్షుడు ఎ.శ్యామసుందర్‌రెడ్డి తెలిపారు. కడప ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడుతూ ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలను ఏర్పాటుచేసి ఒక్కో పాఠశాలకు ఒక్కొరకమైన విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మోడల్ ప్రాథమిక పాఠశాల లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలగా కొనసాగించాలన్నారు. పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్య అనుసంధానం చేయాలన్నారు. 6, 7వ తరగతులున్న చోట నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 6,7,8. తరగతులున్న చోట ఆరుగురు స్కూల్ అసిస్టెంట్ల పోస్టులను కొనసాగించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామోపాధ్యాయుడి పోస్టును మంజూరు చేయాలన్నారు. ఉన్నత పాఠశాలలో 45 మంది విద్యార్థులు దాటితే రెండవ సెక్షన్, ఆపై ప్రతి 35 మందికి అదనపు సెక్షన్ ఏర్పాటుచేయాలన్నారు. సీపీఎస్, జీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్‌ను కొనసాగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, బదిలీలను మాన్యువల్ కౌన్సిలింగ్ విధానంలో నిర్వహించాలని కోరుతూ మే 5న పాత తాలూకా కేంద్రాలలో నిరసన చేపడతామన్నారు. మే 9న జిల్లా కేంద్రాలు, 14న విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు రామభూపాల్‌రెడ్డి, అబ్దుల్‌సత్తార్, రామచంద్రారెడ్డి, క్రిష్ణారెడ్డి, కొండారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పత్రపల్లి గంగమ్మ జాతర

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు హాజరు



ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటికి ఘన స్వాగతం పలుకుతున్న పత్రపల్లి నాయకులు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చింతరాజుపల్లి పంచాయతీ పత్రపల్లి గ్రామంలో వెలసిన గంగమ్మ జాతర గురువారం ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. ఈ జాతరకు ముఖ్య అతిథులుగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రాజంపేట ఎమెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, కోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా జాతరకు విచ్చేసిన నాయకులకు రాసా నడిపయ్య నాయుడు, రాసాల నాయుడు వారి కుటుంబ సభ్యులు బాణసంచా పేల్చి పూల వర్షంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాసాల కుటుంబ సభ్యులు ఇచ్చిన విందులో వారు పాల్గొన్నారు. పత్రపల్లి గంగమ్మ జాతరలో మహిళా భక్తులు బోనాలు సమర్పించి, బలులు రూపంలో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఒంటిమిట్ట వైఎస్సార్ సిపి మండల కన్వీనర్ టక్కోలు శివారెడ్డి, శివారెడ్డి, రాజంపేట నియోజకవర్గం వైఎస్సార్ సిపి యూత్ వింగ్ అధ్యక్షుడు కూండ్ల ఓబుల్ రెడ్డి, రాసాల జయ చంద్ర నాయుడు, రాసాల కదిరయ్య నాయుడు, రాసాల చైతన్య నాయుడు, రాసాల కదిరి ప్రసాద్ నాయుడు, కొటిక రాజమోహన్ నాయుడు, జంగాల శివశంకర్, మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

పత్రపల్లి గంగమ్మకు పూజలు చేసిన మేడా

మండల పరిధిలోని చింతరాజుపల్లి పంచాయతీ, పత్రపల్లి గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి జాతరకు విచ్చేసిన రాజంపేట మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆయనకు పత్రపల్లికి చెందిన బొడ్డే వెంకటరమణ ఘనస్వాగతం పలికారు. అనంతరం రమణ ఇచ్చిన విందుకు హాజరయ్యారు.

మానసిక వికాసానికి గ్రంథాలయాలు దోహదం



విద్యార్థులకు స్పోకన్ ఇంగ్లీష్ నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు

సిద్దవటం : విద్యార్థుల మానసిక వికాసానికి గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడతాయని గ్రంథాలయాధికారిణి లక్ష్మినారాయణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం సిద్దవటం గ్రంథాలయంలో ఉపాధ్యాయుడు శ్రీహరిసాయి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, కథలు చెప్పించడం, పుస్తక పఠనం చేయించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు క్రిష్ణ మాట్లాడుతూ గ్రంథాలయానికి రావడం వలన కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో ఆటలు ఆడించారు. మొత్తం 28 మంది శిక్షణా శిబిరానికి విద్యార్థులు హాజరయ్యారని ఆమె పేర్కొన్నారు.

కమలాపురం మెజిస్ట్రేట్‌గా మధుసూదన్‌రావు

కమలాపురం : కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్‌గా ఎస్.మధుసూదన్‌రావు బాధ్యతలు చేపట్టారు. గురువారం ఆయన కోర్టు కార్యాలయానికి వచ్చి ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ నుంచి చార్జ్ తీసుకున్నారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్‌గా వచ్చారు. ఇక్కడ మెజిస్ట్రేట్‌గా ఉన్న లావణ్య పదోన్నతిపై శ్రీకాకుళం జిల్లాకు వెళ్లిన విషయం విదితమే. మధుసూదన్‌రావు విలేకరులతో మాట్లాడుతూ కక్షిదారులకు అందుబాటులో ఉంటూ వారికి న్యాయ సేవలు అందేలా కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా లోక్‌అదాలత్‌పై ప్రత్యేక దృష్టి సారించి కేసులు ఎక్కువగా పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఊటుకూరులో వెలసిన పురాతన చెన్నకేశవస్వామి దేవాలయంలో గురువారం గ్రామస్తులు కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవంలో కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

వీరపునాయునిపల్లె : లింగాల గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. దాతల సహకారంతో ఆలయాన్ని పునరుద్ధరించారు. గురువారం చివరి రోజు కావడంతో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు మిట్టపల్లె, గంగిరెడ్డిపల్లెల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కోలాట కార్యక్రమం భక్తులను అలరించింది. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, నరేంద్రాచార్యులు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేలకొరిగిన రేకుల షెడ్డు

కమలాపురం : స్థానిక వెలుగు పాత కార్యాలయం వద్ద ఉన్న రేకుల షెడ్డు ఎగిరి పడింది. గురువారం సాయంత్రం కమలాపురం మండలంలో భారీ గాలులు వీచాయి. దీంతో అక్కడక్కడ వృక్షాలు నేల కొరిగాయి. వెలుగు పాత కార్యాలయంకు సంబంధించిన రేకుల షెడ్డు విరిగి పడింది. విద్యుత్ సరఫరా నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అధ్యాపకుడి కుటుంబానికి ఆర్థికసాయం



శివ ప్రసాద్ కుటుంబ సభ్యులకు పత్రాలను అందజేస్తున్న వైవీయూ ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం మైక్రోబయాలజీ విభాగంలో పనిచేసే అధ్యాపకుడు డా.శివప్రసాద్ కుటుంబానికి సహచర అధ్యాపకులు గురువారం ఆర్థికసాయం అందజేశారు. శివప్రసాద్ ఇటీవలే గుండెపోటుతో మృతిచెందారు. అధ్యాపకులు, ప్రిన్సిపల్ స్వచ్ఛందంగా సేకరించిన రూ.52 వేలను శివప్రసాద్ కుమార్తె వెంకటశివ, మనోజ్ఞల పేరిటఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ పత్రాలను మనోజ్ఞ, అమె తల్లి ప్రతిమలకు ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.కొప్పోలురెడ్డి శేఖర్‌రెడ్డి, డా. టి.సురేష్ బాబు, ఎం.నాగార్జునరెడ్డి, డా.శీలంరవి, డా.ఎస్.ఖాజాపీర్, చదలవాడ వెంకటేష్, డా.వై.హరిబాబు, డా.సి.రాజశేఖర్, భైరవపోగు ఈరప్ప, టి.వీరకుమార్‌రెడ్డి, డా.పి.వినోద్ కుమార్, ఎం.శ్రీకాంత్, బోయ చినరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఎడారి ఓడ



కడప నగరానికి బహుదూరపు బాటసారి వచ్చేసింది. ఒంటి అంటే గుర్తుకు వచ్చేది రాజస్థాన్. వాటి పోషణ భారమై థార్ ఎడారి ప్రాంతం నుంచి ఎడారి ఓడలను దేశ నలమూలలకు తరలిస్తారు. పార్క్‌లో పిల్లల సరదా కోసం ఒంటెపై సవారీ చేస్తుండడంతో నెల్లూరు మీదుగా కడప నగరవనం రింగ్ రోడ్డు వద్దకు ఒంటెను తీసుకువచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

ఉగ్రవాదాన్ని తుదముట్టించాలంటూ ర్యాలీ



ఉగ్రదాడులకు నిరసనగా సెల్‌ఫోన్ లైట్‌తో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కడప కోటిరెడ్డి సర్కిల్: ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తున్న ఉగ్రవాదాన్ని తుదముట్టించాలని ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పవర్ అల్తాఫ్ పిలుపునిచ్చారు. జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్ర దాడిని నిరసిస్తూ గురువారం సాయంత్రం వివిధ సంఘాల ప్రతినిధులతో కడప నగరం కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సమయంలో పెద్ద ఎత్తున గాలులు వీయడంతో కొవ్వొత్తులు వెలిగించేందుకు వీలుకాలేదు. దీంతో తమ సెల్‌ఫోన్ టార్చిలైట్లను వెలిగించి ఉగ్రదాడుల్లో మృతిచెందిన వారికి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అల్తాఫ్ మాట్లాడుతూ దేశంలో శాంతి, సామరస్యాలు, ప్రేమ, ఐక్యత మాత్రమే అభివృద్ధి కావాలని, ఉగ్రవాదం సమూలంగా నశించాలని కోరారు. దాడుల్లో మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని, క్షతగాత్రులకు త్వరలో స్వస్థత కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వెంకటయ్య, లక్ష్మయ్య, వీరబ్రహ్మయ్య ఆచారి, పెన్నం మధుసూదన్, వెంకటసుబ్బారెడ్డి, కుల్లాయప్ప, ప్రతాప్‌రెడ్డి, షంషీర్,మురళీధర్‌రెడ్డి, సయ్యద్ మైనుద్దీన్, రామగంగిరెడ్డి, సలీ, బహూద్దీన్, నరేంద్రకుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన ఉండాలి



మట్టి నమూనాలను సేకరిస్తున్న విద్యార్థినులు

సిద్దవటం : మండలంలోని జ్యోతి గ్రామ రైతులకు తిరుపతి శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థినులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ గ్రామీణ అవగాహన కృషి అనుభవ పథకం (ఆర్‌ఏడబ్ల్యూఈపీ) కింద మట్టి సేకరణ ప్రక్రియను రైతులకు ప్రత్యక్షంగా చూపించి, దాని అవసరం ప్రయోజనాలను రైతులకు వివరించామన్నారు. విద్యార్థినులు ముందుగా పొలాల్లో వివిధ ప్రదేశాల నుంచి 15 – 20 సెంటీమీటర్ల లోతులో మట్టిని సేకరించామన్నారు. మొత్తం 8 – 10 ప్రదేశాల్లో నుంచి మట్టిని తీసుకొని మట్టిని సంచిపై పరచి రాళ్లను తొలగించి, సుమారు 500 గ్రాముల మట్టిని నమూనాగా తీసుకున్నామన్నారు. ఈ నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించి మట్టిలోని పోషకాలు, పీహెచ్ స్థాయి, తేమ శాతం వంటి విషయాలను తెలుసుకోవచ్చునని చెప్పారు. మట్టి పరీక్ష ద్వారా రైతులకు సరైన ఎరువులు వేసుకోవచ్చునని, ఇది ఖర్చు తగ్గించడంతో పాటు దిగుబడిని పెంచుతుందని విద్యార్థులు వివరించారు.